సాక్షి పల్నాడు

గురువారం । 10 । జులై । 2025



సాయినాథుని గ్రామోత్సవం

ముప్పాళ్ళ: గురుపౌర్ణమి సందర్భంగా చాగంటివారి పాలెంలోని ప్రసన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో బుధవారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.



అలరించిన భక్తి సంకీర్తన

నగరంపాలెం: స్థానిక ఆదిత్యనగర్‌లోని సాయిబాబా మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి సంకీర్తన కార్యక్రమం అలరించింది.

శాకంబరిగా పార్వతీ అమ్మవారు



దుగ్గిరాల: గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మ వారు బుధవారం శాకంబరిగా భక్తుకుల దర్శనం ఇచ్చారు.

చెమట చుక్కలు చిందించి సాయిసాధన చిట్ ఫండ్‌లో పెట్టిన సొమ్మంతా పోగొట్టుకుని రోడ్డున పడి గుండెలు బాదుకున్న బాధితుల ఆర్తనాదాలు వినిపిస్తూనే ఉన్నాయి. పిల్ల పెళ్లికి దాచుకున్న డబ్బు తీసుకుని బోర్డు తిప్పేస్తే.. ఆ తల్లిదండ్రుల గుండె మంటలు రగులుతూనే ఉన్నాయి. అయ్యా.. ఆత్మహత్యే శరణ్యమంటూ కనిపించిన ప్రతి ఒక్కరి కాళ్లు పట్టుకుని వేడుకున్న బాధితుల రోదనలు మిన్నంటుతూనే ఉన్నాయి. తమ కష్టం తిరిగొస్తుందో, రాదోననే దిగులుతో ఎదురు చూస్తున్న వారు కన్నీళ్లు కారుస్తూనే ఉన్నారు. అసలు నిబంధనలే పాటించకుండా అడ్డగోలుగా చిట్‌లు వసూలు చేసి, కుచ్చుటోపీ పెట్టిన బడాబాబులు మాత్రం దర్జాగా తిరుగుతున్నారు. నిబంధనలు పాటించని ఇంకా ఎన్నో సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయి. పాలకులు, అధికారులు మాత్రం స్పందించడం లేదు.

చీటీంగ్ పాట!

ప్రజలను నట్టేట ముంచుతున్నా పట్టని కూటమి పాలకులు

- నిబంధనలు పాటించని చిట్‌ఫండ్ సంస్థలు
- ఇప్పటికే 'సాయి సాధన' దెబ్బకు అల్లాడుతున్న బాధితులు
- కనీస రిజిస్ట్రేషన్ కూడా లేకుండా చిట్‌ఫండ్ నిర్వహణ
- ఇదే దారిలో కొనసాగుతున్న మరికొన్ని సంస్థలు
- కన్నెత్తి కూడా చూడని సంబంధిత అధికారులు
- ఇకనైనా తగిన చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్



నరసరావుపేటలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం



నరసరావుపేటటౌన్: రిజిస్ట్రేషన్ ఉన్న చిట్ ఫండ్‌లో సభ్యులుగా చేరితే డబ్బులకు ఢోకా లేదంటూ నమ్మించి కోట్లాది రూపాయలు పోగేసుకొని రాత్రికి రాత్రే సాయిసాధన చిట్ ఫండ్ సంస్థ బోర్డు తిప్పేసిన సంగతి తెలిసిందే. మోసపోయిన బాధితులు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లితే పిడుగు లాంటి వార్త వినాల్సి వచ్చింది. సాయి సాధన చిట్‌ఫండ్‌కు అసలు రిజిస్ట్రేషన్ల శాఖ అనుమతులు లేవని తెలిసింది. యథేచ్ఛగా అక్రమ చీటీపాటల లావాదేవీలు కొనసాగించినట్లు తెలిసింది. దీంతో చిట్‌ఫండ్స్ విషయంలో అధికారుల డొల్లతనం తేటతెల్లమైంది. చట్టబద్ధమైన నిబంధనలు, రిజిస్ట్రేషన్ల శాఖ అనుమతులు లేకుండా నడుస్తున్న ఈ చీటీ పాటలకు అమాయక ప్రజలు పొదుపు ధనాన్ని పూర్తిగా నష్టపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రజల అవగాహన లోపం ఈ మోసాలకు దారి తీస్తున్నాయి. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఇటీవల అనధికార చిట్ ఫండ్ సంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత శాఖ అధికారులు, అటు ప్రభుత్వం మౌనం వహించటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అనధికారంగా నడుస్తున్న పాటలు

చట్టపరంగా చిట్‌ఫండ్ సంస్థలు నడపాలంటే రిజిస్ట్రేషన్ల శాఖ అనుమతి తప్పనిసరి. కానీ ఇవి ఏమీ పాటించకుండా కొన్ని సంస్థలు అనధికార చీటీపాటలు నిర్వహిస్తున్నాయి. అందులో సభ్యులుగా చేరి చివరకు కట్టిన సొమ్ము చేతికి అందక బాధితులుగా మిగులుతున్నారు. పేరుకే సంస్థలు ఏర్పాటు చేస్తున్నారుగానీ, వాస్తవానికి ఎటువంటి బాధ్యత లేకుండా తెలివిగా వ్యవహరిస్తున్నారు. కొన్ని చిట్‌ఫండ్ నిర్వాహకులు ఒకటి, రెండు చీటీ పాటలకు అనుమతి పొందుతున్నారు. ఇక మిగిలినవి అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఏ ఆధారాలు లేకుండానే వేరే ప్రాంతాలకు తరలి పోయే సంస్థల యజమానుల వల్ల వందల సంఖ్యలో కుటుంబాలు డబ్బు నష్టపోతున్నాయి.

అమాయకులే బలిపశువులు

ఈ చీటీ పాటల మాయాజాలంలో పడే వారి తాలూకు బాధలు వర్ణనాతీతంగా మరాయి. అవసరానికి ఆదుకుంటాయని రూపాయి, రూపాయి కూడ బెట్టి స్థోమతను బట్టి నెలకు రూ.5,000 నుంచి రూ.50,000 వరకూ చెల్లిస్తూ వచ్చారు. చివరికి లబ్ధిదారులు డబ్బు పొందే సమయంలో నిర్వాహకులు షాక్ ఇస్తున్నారు. బోర్డు తిప్పేసి మాయం కావడం పరిపాటిగా మారింది. కట్టిన డబ్బులకు చట్టపరంగా ఏ విధమైన ఆధారాలూ లేకపోవటంతో సభ్యులు మోసపోతున్నారు. దీంతో పోలీసులు కూడా అనధికార చిట్‌లపై కేసులు నమోదుకు ముందుకు రావటం లేదు. ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఉంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

చిట్ ఫండ్ మోసాలపై దృష్టి పెట్టాల్సిన రిజిస్ట్రేషన్, పోలీస్, రెవెన్యూ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించకపోవడమే ఈ తరహా మోసాలకు కారణం అవుతోంది. ప్రజలు ఫిర్యాదు చేసినా నామమాత్రంగానే చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొన్ని సందర్భాల్లో తగిన ఆధారాలు లేని కారణంగా కేసును తిరస్కరిస్తున్నారు. ఫలితంగా మోసగాళ్లు నిర్భయంగా వ్యవహరిస్తున్నారు.

పాటించాల్సిన నిబంధనలు ఇవిగో..

చిట్‌ఫండ్ సంస్థలు నడపాలంటే 1982 చిట్ ఫండ్స్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలి. చీటీ పాటలకు సంబంధించి సభ్యుల వివరాలు ఎప్పటికప్పుడు సమగ్ర వివరాలతో సంబంధిత అధికారులకు తెలియజేయాలి. ప్రతి నెలా నిర్వహణకు సంబంధించి లెక్కలు చూపాలి. సభ్యులకు లిఖితపూర్వక ఒప్పందాలు అందించాలి. ఎంత మొత్తంలో చీటీపాట నిర్వహిస్తున్నారో, అంత సొమ్మును జాయింట్ రిజిస్ట్రార్, చిట్‌ఫండ్ పేర్లతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలి. అయితే నేటి పరిస్థితుల్లో ఈ నియమాలు నామమాత్రంగా మారిపోయాయి. రిజిస్ట్రేషన్ల శాఖ అనుమతి లేకుండానే నిర్వాహకులు చీటీపాటలు నడుపుతున్నారు. ఇది చట్టప్రకారం నేరం అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఇప్పటి వరకు ఒకరిపై కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక నష్టపోయిన వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదు.

నరసరావుపేటలో తాజా పరిస్థితి ఇదీ...

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో అనేక పేర్లతో చీటీ పాటలు నిర్వహిస్తున్నారు. గృహిణులు, చిన్న స్థాయి వ్యాపారులు, రోజువారీ కూలి చేసేకునే వారు, వంటి వారందరూ ఈ పాటల్లో సభ్యులుగా చేరుతున్నారు. కానీ ఇటీవల కొన్ని సంస్థలు వార్షిక మొత్తాన్ని తీసుకుని మధ్యలోనే ఆచూకీ లేకుండా మాయమవడం మొదలు పెట్టాయి. ఒకచోట గోడకెక్కిన బోర్డులు, ఖాళీగా ఉన్న కార్యాలయ గదులు, తాళం వేసిన తలుపులు కనిపిస్తే చిట్‌ఫండ్ సంస్థ బోర్డు తిప్పేసిందని అర్థం చేసుకోవచ్చు. అనధికార చిట్‌ఫండ్‌లపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. లేకుంటే ప్రజలు మరింతగా తమ కష్టార్జితం నష్టపోయే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు వెలగపూడిలో ప్రపంచ జనాభా దినోత్సవం

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



తాడికొండ: ఈనెల 11న తుళ్లూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపంలో ప్రపంచ జనాభా దినోత్సవం జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించి సభా స్థలి ఏర్పాట్లు, బార్ కోడింగ్, వాహనాల పార్కింగ్, సీటింగ్, తాగునీరు, పారిశుద్ధ్య పనులు తదితర నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. పలు సూచనలు జారీ చేశారు. గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, సీపీఓ శేషశ్రీ, డీపీఓ నాగసాయి కుమార్, పీడీ డ్వామా శంకర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎంపీడీఓ శిల్ప, తుళ్లూరు తహసీల్దార్ సుజాత,అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేదవ్యాస ఆరాధన



అమరావతి: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన వైకుంఠపురం భవఘ్ని ఆరామంలోని వేదవ్యాసాలయంలో గురుపూర్ణిమ మహోత్సవాలలో రెండవరోజు కార్యక్రమాలలో భాగంగా బుధవారం వ్యాస భగవానునికి సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, వ్యాస ఆరాధన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవఘ్ని గురూజీ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ఆధునికత, నాగరికత పేరుతో మానవాళి చెడు మార్గం పట్టకుండా సన్మార్గంలో నడిపించడానికి వ్యాస భగవానుడు అందించిన భగవద్గీత మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. వేడుకలలో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, షాక్ బాపూజీ పద్యనాటకం భక్తులను ఎంతగానో అలరించాయి. భక్తులు పలు జిల్లాల నుంచి భారీగా పాల్గొన్నారు.

జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన సీఈ



విజయపురి సౌత్: నాగార్జునసాగర్ కుడి కాలువ జలవిద్యుత్ కేంద్రాన్ని శ్రీశైలం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ చీఫ్ ఇంజినీర్ జి.తిరుమల ప్రసాద్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. శ్రీశైలం క్రస్ట్ గేట్లు ఎత్తి నాగార్జునసాగర్‌కు నీటి విడుదల జరుగుతుండటంతో కుడి జలవిద్యుత్ కేంద్రంలో పవర్ జనరేషన్‌కు సిద్ధంగా ఉండాలని సూచించారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెన్‌కో క్వార్టర్స్‌ను పరిశీలించారు. సీఈ తిరుమల ప్రసాద్‌ను జెన్‌కో అధికారులు ఘనంగా సత్కరించారు. కుడి జలవిద్యుత్ కేంద్రం ఈఈ సీహెచ్ అప్పాజీ, సివిల్ ఎస్ఈ కె.వెంకటరమణ, సివిల్ ఈఈ సుబ్రహ్మణ్యం, 327 యూనియన్ సెక్రటరీ బి.సూరజ్‌చంద్, అధ్యక్షుడు ఎం.సాంబశివ, ఎస్.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అమరేశ్వరుని ఆదాయం రూ.27.09 లక్షలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నాలుగు నెలలుగా హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. కోటప్పకొండ దేవస్థానం సహాయ కమిషనర్ చంద్రశేఖరరావు పర్యవేక్షణలో దేవాలయంలోని 10 హుండీలను తెరచి అందులో ఉన్న నగదును లెక్కించారు. ఈఓ రేఖ మాట్లాడుతూ హుండీల ద్వారా రూ.26,32,499, అన్నదానం హుండీల ద్వారా రూ.75,596, మొత్తం రూ.27,09,095 వచ్చిందన్నారు.

ప్రజల కోసం వైఎస్ జగన్ పోరాటం ఆగదు

- పది లక్షల మందికి నోటీసులిచ్చినా ముందుకే సాగుతాం
- మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు వెల్లడి
- సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరు



మాట్లాడుతున్న కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పర్యటనకు వచ్చిన సందర్భంగా 113 మందికి నోటీసులు ఇచ్చామని పోలీసులు అంటున్నారని, పది లక్షల మందికి ఇచ్చినా ప్రజల పక్షాన వైఎస్ జగన్ పోరాటం చేస్తారని, అది ఆగేది కాదని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. విచారణలో భాగంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి బుధవారం సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌కు ఆయన వచ్చారు. పోలీసుల విచారణ అనంతరం పోలీసుస్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నందున చేతనైతే ప్రజలకు మంచి చేయాలన్నారు. ప్రజలు, ప్రతిపక్షాల వారు రోడ్డు మీదకు రాకూడదంటే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయకుండా తిరుగుబాటు వస్తే ప్రతిపక్షాల గొంతు నొక్కాలని భావిస్తున్నారని పేర్కొన్నారు. ఆ తిరుగుబాటే విప్లవం అవుతుందని, ఆ విప్లవం నాలుగు సంవత్సరాల్లో టీడీపీని కాల్చి పడేయబోతుందన్నారు.

హామీలపై నిలదీస్తున్నందుకే భయం

వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ.. వాస్తవంగా వైఎస్ జగన్‌ను చూస్తే చంద్రబాబుకు భయమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం భయపడుతున్నట్లు పేర్కొన్నారు. అందుకే ఇలాంటి కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. చిత్తూరు వెళితే మామిడి రైతులు కాయలను రోడ్డు మీద పడేస్తున్నారని గుర్తుచేశారు. పల్నాడుకు వస్తే ధాన్యం, పొగాకు, అపరాలు కొనేవారు లేరన్నారు. గొడవలు సృష్టించడం, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై అక్రమ కేసులు పెట్టడం తప్ప ఇంకేమీ చేయడం లేదన్నారు. తమను ఇక్కడకు ఏం చేశామని పిలిపించారని ప్రశ్నించారు. జిల్లా లీగల్ సెల్ అధ్యక్షురాలు రోళ్ల మాధవి, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లంచర్ల సాంబ శివరావు, భావనాశి యల్లారావు, అచ్యుత శివప్రసాద్, ముక్తార్, గుజ్జర్లపూడి చంటి, గుజ్జర్లపూడి కృపారావు, వాకుమళ్ల చెంచిరెడ్డి, తుమ్మల వెంకటేశ్వరరావు, సయ్యద్ ఘోరా, వల్లెం నరసింహారావు, గద్దం వెంకటేశ్వర్లు (బుల్లోడు), గంటా ఏసుబాబు, యాసారపు బాబు తదితరులు పాల్గొన్నారు.

శరణు శాకంబరి



శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శాకంబరి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో రెండో రోజైన బుధవారం పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని శాకంబరిగా దర్శించుకున్నారు. మరో వైపున ఆషాఢ మాసోత్సవాలు కొనసాగుతుండగా.. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి పలు భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించాయి. సుమారు 50కిపైగా భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి. శాకంబరి ఉత్సవాలకు గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని రైతుల నుంచి సుమారు 25 టన్నులకుపైగా కూరగాయలు, ఆకుకూరలను సేకరించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

– ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

రోడ్డేది.. డిప్యూటీ సీఎం సారూ?

కోటప్పకొండ - కొత్తపాలెం రోడ్డు నిర్మాణం మాటల్లోనే..

- నిధులు మంజూరు చేస్తున్నట్లు గతంలో ప్రకటించిన డిప్యూటీ సీఎం
- 8 కి.మీ. రోడ్డుకు రూ.3.9 కోట్లు మంజూరు చేస్తూ జీఓ సైతం జారీ
- ఎనిమిది నెలలు గడిచినా ప్రారంభం కాని పనులు



కంకర బయటపడటంతో అధ్వానంగా తయారైన రహదారి

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానానికి చేరే దారుల్లో ఒకటైన కొత్తపాలెం - కోటప్పకొండ రోడ్డు అధ్వానంగా తయారయింది. కోటప్పకొండ నుంచి గోనెపూడి మీదుగా కొత్తపాలెం వరకు ఈ రోడ్డు ఉంది. ఎనిమిది కిలోమీటర్ల ఈ మార్గంలో ప్రయాణించడం ద్వారా కోటప్పకొండ నుంచి చిలకలూరిపేట – నరసరావుపేట రోడ్డుకు చేరుకోవచ్చు. నాదెండ్ల మండలం నుంచి కోటప్పకొండ వైపునకు వచ్చే ప్రయాణికులు, యాత్రికులు ఈ రోడ్డును ఉపయోగిస్తుంటారు.

రూ.3.9 కోట్లు మంజూరంటూ ప్రకటన

గోతులమయంగా మారిన రహదారిలో వాహనదారుల ఇబ్బందులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గత ఏడాది డిసెంబర్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రముఖ పుణ్యక్షేత్రానికి చెందిన ప్రధాన రహదారి కావడంతో ఆయన స్పందించి రోడ్డు నిర్మాణానికి రూ.3.9 కోట్లు మంజూరు చేస్తున్నట్లు 'ఎక్స్'లో ప్రకటించారు. ఫిబ్రవరిలో జరిగే మహాశివరాత్రికి రోడ్డు నిర్మాణం పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని ప్రకటించారు. ఈ మేరకు జనవరి నెలలో పాలనాపరమైన అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నుంచి జీఓ కూడా విడుదల అయింది.

ఉన్నది తవ్వారు.. కొత్తది వేయరు..

రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో టెండర్ల ప్రక్రియతో సంబంధం లేకుండానే టీడీపీ నేతలు పనులు ప్రారంభించారు. జనవరి నెలలో అప్పటివరకు ఉన్న రోడ్డును పొక్లెయిన్‌తో తవ్వేశారు. దీంతో కనీసం ద్విచక్ర వాహనాలు కూడా ఈ రోడ్డులో ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడం, ఫిబ్రవరి 26వ తేదీన నిర్వహించిన కోటప్పకొండ తిరునాళ్లకు సమయం దగ్గర పడటంతో టెండర్లు లేకుండానే హడావుడిగా రోడ్డు పనులు ప్రారంభించారు. వెట్‌మిక్స్ పరిచి దుమ్ము లేవకుండా నీళ్లు చల్లి తిరునాళ్ల వరకు ముగించారు.

నేటికీ ప్రారంభం కాని పనులు

కొత్తపాలెం - కోటప్పకొండ రోడ్డు పనులకు రెండు నెలలు క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. అయినా నేటి వరకు రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులకు ముందుకు రావడం లేదని తెలుస్తుంది. వెట్‌మిక్స్ వేసిన రోడ్డుపై ప్రస్తుతం కంకర బయటపడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరికే రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఉప ముఖ్యమంత్రి ప్రకటించినా.. నేటికీ రోడ్డు పనుల్లో పురోగతి లేకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఎప్పటిలాగా ప్రకటనలకే పరిమితమైందని, ఆచరణ ఉండదని స్థానికులు విమర్శిస్తున్నారు.



రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు 'ఎక్స్'లో ఉప ముఖ్యమంత్రి పోస్టు

రెండు నెలల్లో పూర్తి చేస్తాం

ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా టెండర్ల ప్రక్రియలో కొంత ఆలస్యం జరిగింది. దీంతో వెట్‌మిక్స్ పనులకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు కూడా నిర్వహించాం. ఇప్పటికి 25శాతం వరకు పనులు పూర్తి అయ్యాయి. పనులు వెంటనే ప్రారంభించి రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకు వస్తాం.

– ప్రసన్నకుమార్, పంచాయతీరాజ్ జేఈ

కార్మికుల సమ్మెతో కేంద్రం దిగి రావాలి

- పట్టణంలో సార్వత్రిక సమ్మె
- ర్యాలీ నిర్వహించిన వామపక్షాలు



ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ర్యాలీలో సీఐటీయూ, ప్రజాసంఘాల నేతలు

నరసరావుపేట: కార్మికుల సమ్మెతో కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి లేబర్ కోడ్ అమలు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం వద్ద నుంచి స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్కు వద్ద ధర్నా శిబిరం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సమ్మె శిబిరానికి సీఐటీయూ నాయకులు షేక్ సిలార్ మసూద్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ మాట్లాడుతూ కేంద్రం తీరుపై మండిపడ్డారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాల్ని ప్రధాని విడనాడాలని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆఫీసు నుంచి ఆర్డీవో కార్యాలయం, గాంధీ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు.

పసుపు ధరలు
(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 668

కొమ్ములు : 521 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	10,350	10,250

కాయలు : 167 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,200	10,291	10,250

మొత్తం అమ్మకాలు : 216.000 క్వింటాళ్లు

-దుగ్గిరాల

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,000 గరిష్టం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	47,553
అమ్మకాలు	45,606
నిల్వ	8,406



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,700
నంబరు-5	10,000-13,200
273	10,000-12,500
341	10,000-13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,200
273	9,800-12,400
341	10,000-13,500
4884	10,000-12,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,500
బాడిగ-355	10,000 - 12,700
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 11,000
తాలుకాయలు	5,000 - 6,700

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,300
బాడిగ - 355	10,000-12,500
దేవనూరు డీలక్స్	10,000-12,300
తాలు	5,200 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

'కూటమి' దెబ్బకు రైతు కుదేలు

- ఆర్థిక సాయం అందివ్వని ప్రభుత్వం
- ఖరీఫ్ పెట్టుబడికి తప్పని పాట్లు
- నగదు లేక కష్టపడుతున్న అన్నదాతలు



సత్తెనపల్లి: రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం అవుతున్నారు. దుక్కులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. సాగుకు సంబంధించిన పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గతంలో రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. రైతుకు రూ. 13,500 చొప్పున రైతు భరోసా మంజూరు చేయడంతో కొంత లబ్ధి చేకూరింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా కంటే అదనంగా కొంత చేర్చి రైతుకు రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద అందిస్తామని టీడీపీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది.

నిధులు విడుదలవుతాయా?

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఏటా రూ. 20 వేలు అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏడాదైనా ఇంతవరకు పైసా కూడా ఇవ్వలేదు. రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుండటంతో ప్రస్తుతం గ్రామాల్లో ఈ పథకానికి సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియ చేపట్టారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధి పొందడానికి సమీప రైతు సేవా కేంద్రాలకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేదెన్నడో... అర్హులను గుర్తించి నిధులు విడుదల చేసేదెప్పుడో.. అని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

జిల్లాలవారీగా పరిస్థితి ఇదీ...

జిల్లా	అర్హులైన రైతులు	ఈకేవైసీ పూర్తి	ఈకేవైసీ పెండింగ్
గుంటూరు	1,07,942	1,02,731	5,211
పల్నాడు	2,39,110	2,31,495	7,615
బాపట్ల	1,59,157	1,52,842	6,315

భారంగా మారిన సాగు

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు ఏటికేడు పెరుగుతున్నాయి. దుక్కి, కూలీల ఖర్చులు కూడా అమాంతం పెరిగాయి. వీటన్నింటిని దాటి పంటలను సాగు చేయాలంటే తగిన దిగుబడి చేతికి వస్తుందన్న ఆశ కూడా పూర్తిగా లేదు. వాతావరణ పరిస్థితుల కారణంగా గతంలో కంటే తక్కువగా పంటలు సాగు చేస్తున్నారు.రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం, పంట నష్టపోతే బీమా పరంగా అండ లభించడం లేదు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించి కనీసం పట్టించుకోవట్లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న కేఎన్‌పీఎస్, ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: కుల నిర్మూలనా పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌తో పాటు దేశవ్యాప్తంగా అనేక అక్రమ కేసుల్లో జైలు శిక్ష అనుభవిస్తున్న ఆదివాసీలు, ప్రజాస్వామికవాదులు, ఉద్యమకారులను బేషరతుగా విడుదల చేయాలని కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యతిరేక ఉపా చట్టం కింద ప్రభాకర్‌ను అరెస్టు చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన్ను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కోరుతూ కేఎన్‌పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న ఒంగోలు పట్టణంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ఎదుట సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేఎన్‌పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్న ప్రసాదు, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఓర్సు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు బయ్యవరపు రామయ్య, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు చలంచర్ల అంజి, కంబాల ఏడుకొండలు, దేశ భక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని భార్య హంతకుడు ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు (ఫైల్)

బొల్లాపల్లి:అనుమానం పెనుభూతమై అర్ధాంగిని కడతేర్చిన భర్త అదే గ్రామ పొలాల్లో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం జరిగింది. భార్యాభర్తల మృతితో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. బండ్లమోటు ఎస్ఐ ఏ. బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లవాగు గ్రామ పొలాల్లో గంగనబోయిన వెంకటేశ్వర్లు (37) చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు రోజుల కిందట ఇదే పొలాల్లో భార్య కృష్ణకుమారిని హత్య చేసి పరారీలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో భార్యను హత్య చేసిన ప్రదేశానికి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పొలానికి వచ్చిన గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన ప్రాంతానికి వారు చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడు తమ్ముడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

మృతదేహంతో ఫ్యాక్టరీ ముందు ధర్నా



ఫ్యాక్టరీ ప్రధాన ద్వారం వద్ద మృతుని కుటుంబ సభ్యుల ధర్నా

సత్రశాల(రెంటచింతల): స్థానిక పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, కార్మికులు పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ప్రధాన ద్వారం వద్ద బుధవారం రాత్రి ధర్నా చేశారు. ఫ్యాక్టరీలో ఏడు సంవత్సరాలుగా పని చేస్తున్న ఉప్పుతోళ్ల మల్లయ్య (47) జూన్ 29న విధి నిర్వహణలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే పరాశక్తి ఫ్యాక్టరీ అంబులెన్స్‌లో తొలుత పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఫ్యాక్టరీ యాజమాన్యం రూ. 50 వేలు అందజేసింది. అది కాకుండా మల్లయ్య కుటుంబ సభ్యులు మరో రూ. 2 లక్షల వరకు ఖర్చు చేశారు. ఆర్థికస్తోమత లేకపోవడం వల్ల అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఫ్యాక్టరీ అధికారులు మెరుగైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల మల్లయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలంటూ మృతదేహంతో ఫ్యాక్టరీ ప్రధాన రహదారి ముందు ధర్నా చేశారు. కొంతసేపు వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని సర్ది చెప్పారు. మల్లయ్యకు భార్యతో పాటు నలుగురు సంతానం ఉన్నారు. తొలుత భార్య లక్ష్మమ్మ న్యాయం చేయాలని కోరుతూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఇండోర్ ఆడిటోరియం స్టేడియం ప్రారంభం



సత్తెనపల్లి: సత్తెనపల్లిలో ఇండోర్ ఆడిటోరియం స్టేడియాన్ని బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతి ప్రాంతంలో సుమారు 50 వేల ఎకరాలు అభివృద్ధి చేసి దానిలో 2,500 ఎకరాలు అంతర్జాతీయ క్రీడా మైదానానికి కేటాయిస్తానని చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. తొలుత స్టేడియాన్ని ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. స్టేడియానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్, గ్రౌండ్, ప్రహరీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వాటికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వినతి పత్రం అందించారు. నూతనంగా ప్రారంభించిన కోర్టులో బ్యాడ్మింటన్ ఆడారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డి పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు



రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతున్న వెంకట్రావు

పిడుగురాళ్ల రూరల్: మిరప నారు పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు సూచించారు. కామేపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం సమగ్ర ఉద్యాన మిషన్ ఆధ్వర్యంలో మిరప నారు పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు, డాట్ సెంటర్ అధికారి డాక్టర్ నగేష్ హాజరయ్యారు. ముందుగా కామేపల్లిలో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట్రావు నర్సరీ చట్టం- 2010 గురించి యజమానులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. స్టాక్, సేల్స్, తనిఖీ అధికారి రిజిస్టర్లతో పాటు రసీదులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. నర్సరీ చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా డాట్ సెంటర్ అధికారి డాక్టర్ నగేష్ మిరప నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విత్తన శుద్ధి, సస్యరక్షణ , విత్తే సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కో- ఆర్డినేటర్ మస్తాన్‌వలి, ఉద్యాన శాఖ అధికారి కుమారి అంజిలిబాయి, గ్రామీణ ఉద్యాన శాఖ అధికారులు కరిముల్లా, దస్తగిరి, పాల్గొన్నారు.

నేటి నుంచి టౌన్ చర్చి శత వార్షికోత్సవాలు

ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ప్యారిష్ పాస్టర్ రెవ.దేవరపల్లి ఏసురత్నం



ఆవిష్కరణలో రెవ.ఏసురత్నం, లెనిన్‌బాబు, సాల్మన్‌రాజు, ఎంవీబీ ప్రకాష్‌బాబు

తెనాలి: పట్టణంలో టౌన్‌చార్చిగా పిలుచుకునే ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చి (తూర్పు గుంటూరు సినడ్) క్రీస్తు దేవాలయం శతవార్షిక మహోత్సవాలు గురువారం నుంచి వైభవంగా ఆరంభం కానున్నాయి. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల ఆహ్వాన పత్రిక, బ్రోచర్‌ను బుధవారం టౌన్‌చర్చిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి ఏసురత్నం, అడిషనల్ పాస్టర్లు రెవరెండ్ వై.లెనిన్‌బాబు, రెవరెండ్ డి.సాల్మన్‌రాజు, రెవరెండ్ ఎంవీబీ ప్రకాష్ బాబు అడ్‌హాక్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. 10,11,12 తేదీల్లో ఉదయం ప్రార్థన, ఆరాధనలు, సాయంత్రం చర్చి వెలుపల వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గౌరవ అతిథులుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఏఈఎల్ చర్చి కంట్రోలర్ జస్టిస్ కురియన్ జోసెఫ్, కేరళకు చెందిన మాజీ జడ్జి జోసెఫ్ పీఎస్, ఆంధ్రప్రదేశ్ మాజీ జూనియర్ జడ్జి ఎస్.జేసురత్నకుమార్ హాజరవుతారని తెలిపారు.

- రెవ.వై.లెనిన్‌బాబు మాట్లాడుతూ హాఫ్ దొర టౌన్‌చర్చిని కట్టించి విద్యాలయం, వైద్యశాలను నిర్మించి ప్రజలకు సేవలందించినట్లు తెలిపారు. మూడురోజుల ఉత్సవాలకు ప్రజలు హాజరై దేవుని మన్ననలు పొందాలని అడిషనల్ పాస్టర్లు రెవ. డి.సాల్మన్‌రాజు, రెవ.ఎంవీబీ ప్రకాష్‌బాబు కోరారు. శతవార్షిక మహోత్సవాల్లో భాగంగా 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి సెయింట్ జాన్స్ విద్యాసంస్థ పక్కనగల లూథరన్ యూపీ స్కూలు ప్రాంగణంలో ప్రేమ విందు ఉంటుందని అడ్‌హాక్ కమిటీ సభ్యుడు జి.వేమయ్య చెప్పారు.

ద్విచక్ర వాహనం మాయం

దగ్గుబాడు(కారంచేడు): ఇంటి బయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనం తెల్లవారేసరికి మాయం అయిన ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు షేక్ అప్సనా తెలిపిన వివరాలు.. ముస్లిం కాలనీలోని ఉర్దూ పాఠశాల సమీపంలో మంగళవారం రాత్రి వాహనం ఎప్పటిలాగానే బయట పార్క్ చేసి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఇంటి బయటకు వచ్చి చూస్తే అప్పటికే బైక్ లేదు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు. గత ఏడాది కూడా ఇదే కుటుంబానికి చెందిన మరో వాహనం కూడా చోరీకి గురైనట్లు చెబుతున్నారు.

న్యాయవాదిపై మరో న్యాయవాది దాడి

- సివిల్ వ్యవహారంలో డబ్బుల దగ్గర వివాదం
- ఇద్దరు న్యాయవాదులు కూటమి నేతలే..
- వినుకొండలో తీవ్ర చర్చనీయాంశం

వినుకొండ: సీనియర్ న్యాయవాదిపై మరో సీనియర్ న్యాయవాది దాడి చేసి, దుర్భాషలాడిన ఘటన వినుకొండ పట్టణంలో న్యాయస్థానం ముందు చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వినుకొండ రూరల్ మండలం వెంకుపాలెం గ్రామ పరిధిలోని భూమికి సంబంధించి సివిల్ దావా ఒకటి వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నడుస్తోంది. అయితే, పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఆ దావాను కొంత కాలం నుంచి తన క్లయింట్ తరఫున వాదిస్తూ వచ్చాడు. తనకు ఆ కేసును ఇచ్చినట్లయితే రాజీ చేసి, ప్రతిఫలం ముట్టచెబుతా అని మరో సీనియర్ న్యాయవాది దావాను చేజిక్కించుకున్నాడు. అదేమని అడిగితే కోర్టు గేటు ముందే దాడి చేశాడు. అయితే, న్యాయవాదులు ఇద్దరూ కూటమికి చెందిన వారే కావడం విశేషం . ఈ గొడవ బయటకు పొక్కడంతో పట్టణ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. న్యాయవాదులు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని కూటమి ప్రభుత్వం పరువు తీస్తున్నారని ఆ పార్టీలో కూడా చర్చ జరగడం విశేషం.ఇంత జరిగినా దాడిపై న్యాయవాది ఫిర్యాదు చేయకపోవడం విశేషం.

గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్‌కు పతకాలు



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వడ్లమాని రవి, రామచంద్రరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక సేవా విభాగంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గుంటూరు జిల్లా రెడ్‌క్రాస్‌కు గవర్నర్ పురస్కారాలు లభించాయి. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ గుంటూరు జిల్లా చైర్మన్ డాక్టర్ వడ్లమాని రవి, వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు అవార్డులను అందుకున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి, 2023-24 ఆర్థిక సంవత్సరానికి తృతీయ ఉత్తమ జిల్లాగా గుంటూరు రెడ్‌క్రాస్‌కు అవార్డులు వరించాయి.

కుడి జల విద్యుత్ కేంద్రం ఉద్యోగుల నిరసన



విజయపురిసౌత్: ఎన్‌సీసీవోఈఈఈ దేశవ్యాప్త సమ్మె పిలుపు మేరకు జేఏసీ నాయకులు, ఉద్యోగులు సంఘీభావంగా కుడి జలవిద్యుత్ కేంద్రం ప్రధాన ద్వారం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో 15 నిమిషాల సేపు ఆందోళన చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ జి. రాజారెడ్డి, సెక్రటరీ అములు నాయక్, కన్వీనర్ బి. సూరజ్‌చంద్, కో-చైర్మన్ వెంకటేశ్వర్లు, కో-సెక్రటరీ రాణి, కో-కన్వీనర్ రామకృష్ణ, ఎస్. సాంబశివరావు, మెంబర్స్ ఎస్‌కే అక్బర్, రేవతి, సీహెచ్. తిరుపతిరావు, వై. వెంకటేశ్వర్లు, మనోహరమ్మ, సీహెచ్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి నోటీసులు



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ఈ నెల 11వ తేదీన సత్తెనపల్లి పట్టణ పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరుకావాలంటూ.. సత్తెనపల్లి పట్టణ పోలీసులు బుధవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డికి నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటనకు సంబంధించి అక్రమ కేసులు నమోదు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి నోటీసులు జారీ చేశారు. క్రైం నెంబర్ 156/2025 అండర్ సెక్షన్ 189(2), 189(3), 189(4), 298, 351 (2), 352, 126(2), 61(2) రెడ్‌విత్ 190 బీఎన్ఎస్ అండ్ సెక్షన్ 3ఆఫ్ పీడీపీపీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు అంశంలో జరిగిన నేరానికి సంబంధించి మీ పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా రూఢీ అయిన నేపథ్యంలో, దర్యాప్తులో భాగంగా సత్తెనపల్లి పట్టణ పోలీసుస్టేషన్‌కు హాజరుకావాలని నోటీసులో పోలీసులు పేర్కొన్నారు.

వైకుంఠపుర వాసుని ఆదాయం రూ.46.76 లక్షలు

తెనాలి రూరల్: స్థానిక వైకుంఠపురంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ టి.సుభద్ర, దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.అనుపమ నేతృత్వంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ హుండీల లెక్కింపు జరిగింది. 113 రోజుల అనంతరం లెక్కింపు జరిపారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు, మహిళలు స్వచ్ఛందంగా లెక్కింపు సేవలో పాల్గొన్నారు.

వాహనం ఢీ.. ఒకరు మృతి

మేదరమెట్ల: మోటారు బైక్‌ను వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం చెందారు. కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి గాయాలయ్యాయి. రేణింగవరం గ్రామానికి చెందిన మోషే (37), అదే గ్రామానికి చెందిన సంతోష్‌తో కలిసి మోటారు బైక్‌పై మేదరమెట్ల వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతున్నారు. ఈ క్రమంలో బైకు వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన తుఫాన్ వాహనం బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న మోషే రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయమై , అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో వ్యక్తి సంతోష్‌కు గాయాలయ్యాయి. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.